# సాక్షి చిత్తూరు

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024






**వైభవం.. తిరుణాల..**

సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో తిరుణాలకు జనం భారీగా రావడంతో కిక్కిరిసింది. - 10లో



**ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం**

పాముకాటు వేయడంతో చౌడేపల్లి పీహెచ్‌సీకి కి వెళ్లిన వ్యక్తికి సరైన చికిత్స అందించకపోవడంతో ఇబ్బంది పడ్డాడు. - 10లో

**సైకో వీరంగం**

కూతురు, మనువరాళ్లను బస్సులో ఊరికి పంపడానికి వెళ్లిన తండ్రి, కూతురిపై ఓ సైకో విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చాడు. - 10లో



## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

**పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే**

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడవచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

### నేడు విద్యాసంస్థలకు సెలవు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాతావారణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలకు ముందస్తుగా సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాగులు, చెరువుల వద్దకు పిల్లలను వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

### బోయకొండలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ


**చౌడేపల్లి:** కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల పాలిట వరాలిచ్చే ఆరాధ్య దైవంగా పేరొందిన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కోర్కెలు తీరిన భక్తులు అధిక సంఖ్యలో బోయకొండకు చేరుకుని అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరగడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దివ్వెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షణలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

# మరపురాని మహానేత వైఎస్సార్

- జిల్లాకు కృష్ణా జలాల రాక ఆ మహనీయుడి చలవే
- చిత్తూరు రచ్చబండకు వస్తూ.. తిరిగిరాని లోకాలకు
- నేడు వైఎస్సార్ వర్ధంతి



**చిత్తూరు అర్బన్:** యెడుగూరి సందింటి రాజశేఖర రెడ్డి.. కోట్లాదిమంది గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత.. అన్నదాతల మనుసులో నుంచి ఆ పేరును వేరు చేయలేం.. గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న ఓ నిరుపేద కుటుంబం ఆ పేరును తరతరాలకు మరచిపోదు. ఉన్నతవిద్య అభ్యసించిన విద్యార్థులు ఎంతస్థాయిలో ఉన్నా విస్మరించరు. కరువునేలగా ఉన్న చిత్తూరు జిల్లాలో సిరులు పండించి, ప్రాజెక్టులను పరవళ్లు తొక్కించిన మహనీయుడు. వ్యవసాయం దండగ అంటూ హేళన చేసినవారి నోళ్లు మూయించి కర్షకుడిని రాజును చేసిన అపర భగీరథుడు. రచ్చబండ కోసం చిత్తూరు కు వస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఆ మహానేత నేటికీ ప్రజల గుండెల్లో బతికే ఉన్నాడు. చిత్తూరు జిల్లాపై చెరగని ముద్ర వేసిన వైఎస్సార్ వర్ధంతి నేడు.

**హంద్రీ–నీవా ఆయన చలవే..**

హంద్రీ–నీవా సాగు, తాగునీటి ప్రాజెక్టుల ఘనత పూర్తిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికే దక్కుతుంది. ఈ ప్రాజెక్టును 2013 డిసెంబర్‌లోనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆయన భావించారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి చొరవతో సదుం సమీపంలోని పాపిరెడ్డిగారిపల్లె మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులను మంజూరు చేశారు.

**కుప్పాన్నీ మరువని నేత..**

నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని కూడా వైఎస్సార్ అభివృద్ధి చేశారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పునాది వేసిన ఘనత ఆయనదే. 2006లో ఎం.ఎ ఫ్.సి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. 2007లో శాంతిపురం మండలం అబకలదొడ్డి వద్ద ప్రభుత్వ ఐటీఐని ప్రారంభించారు.

**అడుగు మోపకనే..**



నాడు రాజన్న రాక కోసం అనుప్పల్లెలో ఏర్పాటు చేసిన రచ్చబండ (ఫైల్)

ముఖ్యమంత్రి హోదాలో రచ్చబండకు వస్తున్న రాజశేఖర రెడ్డికి స్వాగతం పలికేందుకు కట్టమంచిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ అందరూ ఎదురు చూస్తున్నారు. ఎంతకీ రాకపోవడంతో అందరిలో ఆందోళన మొదలైంది. వైఎస్సార్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ సిగ్నల్స్ అందకపోవడంతో ఏం జరిగిందో అని అందరిలో ఒకటే టెన్షన్. తీరా మరుసటి రోజున చాపర్ పావురాలగుట్ట వద్ద ప్రమాదానికి గురై ఆయన కన్నుమూశారన్న విషాద వార్తను వినాల్సి వచ్చింది. రాజన్న కూర్చుంటారని ఆశించి భంగపడిన రచ్చబండ మాత్రం నాటి నుంచి మూగబోయింది. అనుప్పల్లె ఊరుఊరంతా మహనేత కోసం కన్నీళ్లు పెట్టుకుంది.

చిత్తూరు జిల్లా విభజన జరిగాక సత్యవేడులోని ఇండస్ట్రియల్ కారిడార్ శ్రీసిటీ తిరుపతి జిల్లాలో చేరింది. చిత్తూరు జిల్లాకు పరిశ్రమల కారిడార్ లేకుండా పోయింది. దీంతో గత ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోనే అన్ని రకాల అనుకూలంగా ఉండే పలమనేరు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటాయని భావించింది. 2022 అక్టోబరులో సర్వే కూడా జరిగింది. దీనిపై అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు రైతుల భూములను కొట్టేసేందుకు ఈ పనులు సాగుతున్నాయంటూ గగ్గోలు పెట్టారు. అయితే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇక్కడ పరిశ్రమల స్థాపనను పట్టించుకోలేదు.



పలమనేరు మండలం జల్లిపేట, మొరం వద్ద ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రతిపాదించిన భూమి

**నాడు అలా.. ఇప్పుడు ఇలా..**

నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ పారిశ్రామికవాడకు భూసేకరణ సర్వే చేస్తే నాటి ప్రతిపక్ష టీడీపీ నేతలు రైతుల భూములు పోతాయంటూ నానా హంగామా చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా పరిశ్రమల స్థాపన గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయమై స్థానిక డీటీ రిషివర్మను వివరణ కోరగా గత ప్రభుత్వంలో ఇక్కడ 2088 ఎకరాలను గుర్తించిన విషయం వాస్తవమేనన్నారు. అయితే ఈ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.

# కారిడార్ కలేనా!

- పలమనేరులో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుపై నీలినీడలు!
- జిల్లా విభజనతో చిత్తూరులో పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం చర్యలు
- పలమనేరు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమని గుర్తింపు
- మొత్తం 2,088 ఎకరాల సర్వే
- చెన్నై–బెంగళూరు, హోసూరు, సేలం మధ్య రోడ్డు కనెక్టివిటీ
- పలమనేరు మీదుగానే ఎక్స్‌ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్ మార్గాలు
- ప్రభుత్వం మారడంతో పట్టించుకోని అధికారగనం

**పలమనేరు:** జిల్లాలోనే ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉండడంతో చల్లగా ఉండే పలమనేరు ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు, రెండు రాష్ట్రాల రాజధానులకు రోడ్డు సౌకర్యం ఉండడంతో గత ప్రభుత్వం ఇక్కడ పరిశ్రమల స్థాపనకు మొగ్గు చూపింది. పలమనేరు మండలంలోని మూడు రెవెన్యూ గ్రామాల్లో 2 వేలకు పైగా ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ప్రాథమిక సర్వే చేసింది. ఈ ప్రాంతంలో పరిశ్రమల రాకతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్ మార్గాలు వెళ్తున్న మార్గానికి సమీపంలోనే ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూములను సమకూర్చేలా అధికారులు భావించారు. దీంతో ఈ ప్రాంతం మరో శ్రీసిటీలా మారుతుందని ఇక్కడి ప్రజలు ఆశపడ్డారు.

**పలమనేరులోనే ఎందుకంటే..!**

పలమనేరు ప్రాంతం సముద్రమట్టం కంటే 1400 అడుగుల ఎత్తులో ఉంది. దీంతో ఇక్కడ వేసవిలోనూ చల్లగానే ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. పలమనేరు నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరు 130 కిలోమీటర్లు, తమిళనాడు రాజధాని చెన్నైలు 220 కిలోమీటర్ల దూరం కలిగి ఉంది. చెన్నై–బెంగళూరు నేషనల్ హైవే 48, అనంతపురం– కృష్ణగిరి హైవే 42 పలమనేరు మీదుగానే వెళ్తున్నాయి. ఇక్కడి నుంచి ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తమిళనాడులోని పలు పట్టణాలకు ఈ ప్రాంతం దగ్గరగా ఉంటుంది. కేరళ రాష్ట్రానికి ఇదే మార్గంగా ఉంది. చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవేకి సమీపంలోనే కాస్త అటుఇటుగా చెన్నై–మైసూరు బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ సుమారు 80 కిలోమీటర్ల మేర నియోజకవర్గం మీదుగా వెళ్లనుంది. దీంతో ఇక్కడ పలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ భావించింది. పొరుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తిని చూపారు.

**రెండువేల ఎకరాలకు పైగా భూసేకరణ..**

పలమనేరు మండలంలోని పలమనేరు, మొరం, జల్లిపేట రెవెన్యూ గ్రామాల పరిధిలోని రామాపురం, రంగినాయునిపల్లి, నక్కపల్లి, మొరం, గజ్జలవారిపల్లి, కురప్పల్లి, కన్నమాకులపల్లి, జల్లిపేట, ఫకీరుపల్లి పరిధిలో 2,088 ఎకరాలను పరిశ్రమల కోసం గతంలో స్థానిక రెవెన్యూశాఖ ప్రాథమిక సర్వే చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రైమరీ స్కెచ్‌ను సిద్ధం చేసింది. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాగా ఉన్నప్పుడు పలు సెల్‌ఫోన్ కంపెనీలు, ఆహార ఉత్పత్తుల కంపెనీలు జిల్లాలోని తూర్పు ప్రాంతాలైన సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోకి వెళ్లాయి. జిల్లా విభజన జరిగాక చిత్తూరు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున(అలాట్‌మెంట్) జిల్లాలో అనుకూల ప్రాంతంగా పలమనేరు పేరు తెరపైకి వచ్చింది.



పలమనేరులో అధికారులు ప్రతిపాదించిన భూమి

### 'ఇన్‌స్పైర్'నామినేషన్లు త్వరగా పూర్తి చేయండి

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాలు ఇన్‌స్పైర్ మనక్ 2024–25 విజ్ఞాన ప్రదర్శనకు నామినేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్, ప్రైవేట్, ఆదర్శ, కస్తూర్బా, కేంద్రీయ, నవోదయ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనాలన్నారు. నామినేషన్ల నమోదు పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 15వ తేదీ లోపు తప్పనిసరిగా నామినేషన్లు నమోదు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల నుంచి ఆరు, ప్రాథమికోన్నత నుంచి 3 ప్రాజెక్టులు తప్పనిసరిగా పంపాలని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ 97018 71545 నంబర్‌లో సంప్రదించాలని ఆదేశించారు.

### అగ్నిమాపక శాఖ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరేష్



నరేష్



జిల్లా అధ్యక్షుడు ఏసుపాదం

**చిత్తూరు కలెక్టరేట్ :** రాష్ట్ర అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘం ఉపాధ్యక్షుడిగా మన్యం నరేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికైన నూతన అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆదివారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల్లో పలమనేరు అగ్నిమాపక శాఖ లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న నరేష్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, అలాగే జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న ఏసుపాదం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికైన అసోసియేషన్ సభ్యులను పలువురు అభినందించారు. ఎన్నికైన వారు మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

# ఇంట్లోనే పవర్

- పీఎం సూర్యఘర్‌తో వెలుగులు
- సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- ఆసక్తి చూపుతున్న వినియోగదారులు
- ఉమ్మడి జిల్లాలో 1,871 మంది దరఖాస్తు

**చిత్తూరు కార్పొరేషన్:** మన ఇంటి పైకప్పు నుంచి సోలార్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు. వీటికి ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోంది. పలువురు ఒకసారి పెట్టుబడి పెట్టి సోలార్ పవర్‌కు ఆసక్తి చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను అమలు చేస్తోంది. భవనం పైభాగంలో సోలార్ రూఫ్ టాప్ (ప్యానల్స్)ను ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించి విక్రయించుకోవచ్చు. నిరంతర విద్యుత్‌తో పాటు అంతరాయాలు, లోఓల్టేజీ, విద్యుత్ బిల్లుల సమస్యలకు చెక్ పెట్టేలా ఈ పథకాన్ని రూపొందించారు. పెట్టుబడి సులభంగా తిరిగి రావడంతో పాటు రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ కూడా అందించడంతో ఈ పథకానికి స్పందన బాగుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1871 మంది విద్యుత్ వినియోగదారులు సూర్యఘర్ పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికీ పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, అపార్టుమెంట్ల వద్ద సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు. ఈ పథకం ద్వారా దేశంలో కోటి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రాయితీలు అందించి, కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కేవలం గృహ లబ్ధిదారులకు మాత్రమే రాయితీలు వర్తిస్తాయి. విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. భవనంపై భాగంలో వంద చదరపు అడగుల స్థలంలో సోలార్ ప్యానెల్స్ అమరుస్తారు. ప్రస్తుతం వాటి విద్యుత్ మీటర్ స్థానంలో నెట్‌మీటర్ ఏర్పాటు చేసి తద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగం లెక్కిస్తారు. అదనపు విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు.



చిత్తూరులో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

| సోలార్ ప్యానెల్స్ | ఉత్పత్తయ్యే యూనిట్లు | నెలకురాయితీ | ఏడాదికి రాయితీ |
|---|---|---|---|
| 1 కిలోవాట్ | 120 | రూ.8000 | రూ.30000 |
| 2 కిలోవాట్ | 240 | రూ.20000 | రూ.60000 |
| 3 కిలోవాట్ | 360 | రూ.32400 | రూ.78000 |

**పెట్టుబడి వెనక్కి**

సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి సంవత్సరంలోపు తిరిగి వస్తుంది. సూర్యఘర్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన నెలరోజుల్లో వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తారు. ముందుగా వినియోగదారులు తమ బ్యాంకుఖాతా వివరాల్ని అప్‌లోడ్ చేయాలి. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ రూఫ్ టాప్ కెపాసిటీ విద్యుత్ ఉత్పత్తి 3–4 ప్యానల్స్ వినియోగిస్తారు.

**ఇలా పొందాలి**

- పీఎం సూర్యఘర్ పథకం పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్ల లోపు ఉండాలి. ముందుగా మొబైల్‌లో సూర్యఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగదారుడి వివరాలు నమోదుతో పాటు ఆరునెలల విద్యుత్ బిల్లుల కాపీలను జతచేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- రిజిస్ట్రేషన్ ఫీజు కిలోవాట్స్‌ను బట్టి చెల్లించాలి. 5 వాట్స్‌కు రూ.1,900, 5 వాట్స్ పై బడితే రూ.5,900 చెల్లించాలి. 10 కిలోవాట్స్ పైబడితే హెచ్‌టీ సర్వీసుదారులు రూ.11,800 చెల్లించాలి.
- 3 కిలోవాట్స్‌లోపు సర్వీసులకు ఫీజు లేదు.
- కిలోవాట్స్‌కు బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు. మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. వినియోగదారులు వాయిదాల ద్వారా రుణం చెల్లించవచ్చు.

జిల్లాలో సూర్యఘర్ పథకం కోసం ఉమ్మడి జిల్లాలో 1871 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1764 మంది ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు వచ్చింది. సోలార్ రూఫ్‌టాప్‌లను ఆయా గృహాలు, అపార్టుమెంట్లు వద్ద ఏర్పాటు చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లా వారీగా సోలార్ సర్వీసుల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు**

| డివిజన్ | వచ్చిన దరఖాస్తులు |
|---|---|
| చిత్తూరు రూరల్ | 128 |
| చిత్తూరు అర్బన్ | 267 |
| మదనపల్లె | 207 |
| పీలేరు | 158 |
| పుంగనూరు | 213 |
| పుత్తూరు | 231 |
| తిరుపతిరూరల్స్ | 261 |
| తిరుపతి టౌన్ | 406 |
| మొత్తం | 1871 |

**ఆదరణ బాగుంది**



"ఉమ్మడి జిల్లాలో సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తులు బాగా వస్తున్నాయి. తమ ఇంటిపై సోలార్ ప్యానల్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి వినియోగదారులు ఆసక్తిగా ఉన్నారు. వీటి ద్వారా నిరంతరం విద్యుత్‌ను పొందవచ్చు. పెట్టిన పెట్టుబడి సంవత్సరంలోపు తిరిగి వస్తుంది. అదనపు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. తదితర సమాచారం కోసం 1912కు ఫోన్ చేయండి. – సురేంద్రనాయుడు, ఎస్ఈ ట్రాన్స్‌కో

### ఉద్యోగమేళా రేపు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 3వ తేదీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ శాఖలు సంయుక్తంగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18–35 ఏళ్ల మధ్య వయసు ఉండి టెన్త్, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9160940479, 9963561755 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## క్లుప్తంగా

### ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం



పాముకాటుకు గురైన ఇదాయితుల్లా



డాక్టర్ గదికి తాళం వేసిన దృశ్యం

చౌడేపల్లె: పాముకాటుకు గురై వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కోటూరుకు చెందిన ఇదాయితుల్లా పొలంలో పని చేస్తుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు చౌడేపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ గదికి తాళం వేసి ఉంది. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఎంఎల్‌హెచ్‌ఓ ధరణి పాముకాటుకు గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స చేశారు. అప్పటికే అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యం అందించడానికి సిబ్బంది పీహెచ్‌సీ వైద్యాధికారి పావనికి ఫోన్ చేస్తే కనీస స్పందన లేదు. దీంతో బాధితుడి కుటుంబసభ్యులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో వారు స్థానికుల సూచనల మేరకు.. మెరుగైన వైద్యం కోసం పెద్దపంజాణి మండలం శివాడికి తరలించారు.

**నిర్లక్ష్యం వీడని డాక్టర్లు, సిబ్బంది**

ఇటీవల డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆదివారం డాక్టర్లు కచ్చితంగా విధులకు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చారు. అయినా ఇక్కడి వైద్యులు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు సక్రమంగా అందించడం లేదని, రోగుల పట్ల సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని, జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు.



చిల్లకూరు మండలం కలవకొండ సమీపంలో టిప్పర్లలో తరలిపోతున్న ఇసుక



చిల్లకూరు మండలం పొన్నవోలు వద్ద ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాలు



# తవ్వేస్తూ.. అమ్మేస్తూ..

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో టీడీపీ నేతలు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. నదులు.. వాగులు.. వంకల్లో ఇసుకను కొల్లగొట్టేస్తున్నారు. చెరువుల నుంచి ప్రభుత్వ.. ప్రైవేట్ స్థలాల వరకు ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తున్నారు. కనిపించిన చోటల్లా గ్రావెల్‌ను తోడేస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లు.. ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేసేస్తున్నారు. అధికారులను మామూళ్ల మత్తులో ముంచి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు.

\- సాక్షి ప్రతినిధి, తిరుపతి



చిత్తూరు మండలంలో..



కలవకొండ సమీపంలో ప్రభుత్వ భూమిని యంత్రాలతో మట్టి తవ్వేస్తున్న టీడీపీ నేతలు



కాళీపాకంలో ఇసుక తరలింపునకు దారి ఏర్పాటు చేసుకుంటున్న అక్రమార్కులు



తిరుపతి రూరల్ మండలం పాడిపేట వద్ద ఇసుక దోపిడీ



యంత్రాలతో మట్టిని తవ్వేయడంతో గుంతలుగా మారిన ప్రభుత్వ భూమి



శ్రీకాళహస్తి సమీపంలో స్వర్ణముఖిలో ఇసుకను కొల్లగొడుతున్న దృశ్యం



## 25 లీటర్ల సారా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, వస్తుసామగ్రి

రొంపిచెర్ల: సారా స్థావరంపై దాడి చేసి 300 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీలోని లోకవారిపల్లెకు సమీపంలో ఆదివారం సారా తయారు చేస్తున్నారని అందిన రహస్య సమాచారం మేరకు దాడి చేసి 300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 25 లీటర్ల సారా విలువ సుమారు రూ.5000 చేస్తుందన్నారు. సారా తయారీకి ఉపయోగిస్తున్న డ్రమ్ములు, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తమ రాకను చూసి నిందితులు పరారయ్యారని అన్నారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. సారా తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. ఎక్కడైనా సారా తయారు చేసినా, విక్రయించినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ సూచించారు.

## పచ్చమూక దాడులపై ఫిర్యాదు



మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితురాలు

తిరుపతి(అలిపిరి): తమ కుటుంబంపై కత్తులతో దాడులు చేస్తున్నారని.. సోమల మండలం, కమ్మపల్లికి చెందిన కలిచర్ల జయంతి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో ఆమెను కలిసి తన ఆవేదన వివరించారు. తాము వైఎస్సార్‌సీపీకి మద్దతుదారులమని, రాజకీయ కక్షతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తమ ఇటుకల బట్టీలను ధ్వంసం చేయడం, ఇష్టారాజ్యంగా ఇతరులకు అమ్మేయడం చేస్తున్నారని వెల్లడించారు. తమ 1.5 ఎకరాల్లోని టమాటా పంటను అమ్ముకోనీయకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. ఆగస్టు 5వ తేదీన టీడీపీకి చెందిన రమేష్‌నాయుడు, చిట్టిబాబు, త్రిలోక్‌నాయుడు, మధుసూదన్‌నాయుడు తదితరులు పుంగనూరులోని తన వస్త్ర దుకాణంలోకి చొరబడి ధ్వంసం చేశారని కన్నీరుమున్నీరయ్యారు. పైగా ఎస్పీ సూచన మేరకు పోలీసులు తమపైనే కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంటనే చిత్తూరు ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలిపైనే కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## మందుబాబులకు జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ చిత్తూరులోని జూనియర్ సివిల్‌జడ్జి ఉమాదేవి శనివారం ఆదేశాలు ఇచ్చారని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. అందులో ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.80 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

## పురుగుల మందు తాగి..

బంగారుపాళెం: కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. కీరమంద ఎస్సీ కాలనీకి చెందిన సుబ్బయ్య(55) రాగిమానుపెంట గ్రామంలో భార్యతో కలిసి ఓ రైతుకు చెందిన మామిడి తోటకు కాపలా ఉంటున్నాడు. సుబ్బయ్య గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గుర్తించిన భార్య చుట్టుపక్కల వారి సాయంతో సుబ్బయ్యను బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కర్ణాటక మద్యం కలిగి ఉన్న సెల్వరాజ్ (58)ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. నగరంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో ఆదివారం పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. చిత్తూరుకు చెందిన సెల్వరాజ్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుంటే అతన్ని తనిఖీ చేశారు. నిందితుడి వద్ద 120 ప్యాకెట్ల కర్ణాటక మద్యం లభించింది. మద్యం సీజ్ చేసి నిందితున్ని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## కారు బోల్తా

కుప్పంరూరల్: కారు బోల్తా పడి ధ్వంసమైనా అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడిన సంఘటన కుప్పం మండలం గంగాపురం వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. బెంగళూరుకు చెందిన నలుగురు వ్యక్తులు కుప్పంలో జరిగే శుభకార్యానికి బయలుదేరారు. తమిళనాడులోని వేపనపల్లి మీదుగా వస్తూ కుప్పానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలోని గంగాపురం వద్ద మలుపులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన పల్లంలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసమైనా అందులోని ప్రయాణికులు మాత్రం నామమాత్రపు గాయాలతో బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కారులోని వారిని బయటకు తీశారు. కారును జేసీబీ సాయంతో రోడ్డుపైకి తెచ్చారు.

## పుట్టిన రోజు నాడే వెంటాడిన మృత్యువు

- గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి
- పుంగనూరులో విషాదం



మృతి చెందిన వేణుప్రసాద్ (ఫైల్)

పుంగనూరు: స్నేహితులకు కలిసి పుట్టినరోజు వేడుకలు ఆనందంగా జరుపుకున్నాడు.. తరువాత ఇంటికి పయనమైన ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం రూపంలో మృత్యువు వెంటాడింది. పుట్టిన రోజు నాడే కొడుకు మరణించడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ విషాదకర సంఘటన పుంగనూరు పట్టణంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. ఎస్.ఎస్.పేటకు పెయింటర్ నారాయణ కుమారుడు వేణుప్రసాద్ (22) ఐస్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఇలా ఉండగా తన పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలసి జరుపుకునేందుకు వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలోని గోకుల్ సర్కిల్ వద్ద వేణుప్రసాద్ బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తల పగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటనతో పట్టణంలో విషాదం నెలకొంది. పోలీసులు శవాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుర్తు తెలియని వాహనం వివరాలను సేకరిస్తున్నారు.

## వైభవం.. రాజనాలబండ తిరుణాల..



రాజనాలబండ తిరుణాలకు హాజరైన జనం (ఇన్‌సెట్) ప్రత్యేక పూజలందుకుంటున్న వీరాంజనేయస్వామి

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం తిరుణాల ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తొలుత రాజనాలబండకు సమీపంలోని కొత్తగూబలవారిపల్లె, దాసరయ్యగారిపల్లె, పెద్దూరు, ఉటూరు గ్రామాలకు చెందిన దేవరెద్దులతో గ్రామపెద్దలు కలిసి మేళతాళాల నడుమ రాజనాలబండకు చేరుకున్నారు. కొలింపల్లె గ్రామం నుంచి గ్రామదేవత బోయకొండ గంగమ్మ అమ్మవారి ఉత్సవమూర్తితో కలసి ఊరేగింపుగా కోలాటలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవుల గానామృతంతో చేరుకుని సంప్రదాయ పద్ధతిలో బండారు పంపకం చేశారు. అక్కడి నుంచి దేవరెద్దులు, బోయకొండ అమ్మవారిని మేళతాళాల నడుమ రాజనాలబండకు ఊరేగింపుగా చేర్చారు.

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు




## సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే..!

సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఇటీవల ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రస్తుత పాలకులు నెరవేర్చాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు సమీర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్ మోహన్‌రెడ్డి, బోడె మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు చిత్తూరు కలెక్టరేట్ ఎదుట సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ధర్నా చేశారు. - చిత్తూరు కలెక్టరేట్




చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్టీయూ నేతలు

## ప్రయాణికులపై సైకో వీరంగం

- బస్‌లో సీటు కోసం టవల్ వేసిన ప్రయాణికుడు
- ఐదుగురిపై బ్లేడుతో దాడి
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు
- కొరవడిన పోలీసుల నిఘా



గాయపడిన ఆదినారాయణ

చౌడేపల్లె: అందరూ చూస్తుండగా పట్టపగలే ఓ సైకో వీరంగం సృష్టించి బ్లేడుతో విచక్షణా రహితంగా ఐదుగురిపై దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లె బస్టాండులో చోటుచేసుకుంది. వివరాలు.. రామసముద్రం మండలం కొండూరుకు చెందిన ఆదినారాయణ, కుమార్తె చిత్ర, మనుమళ్లు నవతేజ్, దివేష్ స్వగ్రామం నుంచి చౌడేపల్లెకు వచ్చారు. అక్కడి నుంచి ఇరికిపెంటకు వెళ్లేందుకు ఆటోలో ఆదినారాయణ తన కుమార్తె, పిల్లలను ఎక్కించి తిరిగి కొండూరుకు వెళ్లేందుకు వేచి ఉన్నాడు. అంతలో పుంగనూరు వైపు నుంచి ఇరికిపెంటకు వెళ్లే బస్సు రావడంతో ఆటోలో ఉన్న తన కుమార్తె, పిల్లలను బస్సులో కూర్చోవడానికి కిటికీలో నుంచి సీటు కోసం బ్యాగు పెట్టాడు. ఇంతలో సోమల మండలం, సూరయ్యగారిపల్లెకు చెందిన రాజేష్ వచ్చి అదే సీటులో కూర్చున్నాడు. దీంతో ఆదినారాయణ, రాజేష్ మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా రాజేష్ కోపోద్రిక్తుడై చిత్రపై చేయి చేసుకున్నాడు. ఇద్దరూ బస్సులో ఘర్షణ పడుతుండడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు సర్ది చెప్పారు. బస్సులో నుంచి కిందకు దిగిన ఆదినారాయణపై ఒక్కసారిగా రాజేష్ బ్లేడుతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. చేతికి, తలపై బలమైన గాయం కావడంతో కేకలు వేయగా చుట్టుపక్కల వారు అతన్ని నివారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే మరో ముగ్గురిపై బ్లేడుతో దాడి చేశాడు. అక్కడ ఉన్న అందరూ కలిసి రాజేష్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగా అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే రాజేష్ మద్యంతో పాటు గంజాయి సేవించి ఉండడంతో ఇష్టారీతిన వ్యవహరించాడు. పోలీస్‌స్టేషన్‌లో కూడా సైకో పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. అయితే బస్టాండులో నిత్యం మందుబాబుల ఆగడాలు అధికమయ్యాయని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ తరహా దాడులు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.